# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 15, జూన్ 2026


## నేడు టీఆర్ఎస్ అధినేత్రి కవిత రాక

**ఆసిఫాబాద్, జూన్ 14, ప్రభాతవార్త :**

టిఆర్ఎస్ పార్టీ అధినేత్రి కవిత కుమురం భీం జిల్లా కేంద్రానికి రానున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కిర్మిల్ల వినోద్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ నెల 15న టీఆర్ఎస్ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత హాజరవతున్నారని, ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించే తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం తోపాటు పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలోని ఫారెస్ట్ చెక్ పోస్ట్ నుంచి ప్రజా ర్యాలీ ప్రారంభమై గాంధీ చౌక్, వివికనంద్ చౌక్, అంబెడ్కర్ చౌక్ మీదుగా కోమరం భీమ్ చౌక్ వరకు వెళ్లి మహనేయులందరికీ పూల మాలలు వేసి నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులతో సమావేశం నిర్వహిస్తుందన్నారు. వివిధ పార్టీల నుండి తెలంగాణ రక్షణ సేన పార్టీ లో చేరికలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ క్రార్యక్రమానికి జిల్లాలోని పార్టీ నాయకులు, తెలంగాణ జాగృతి నాయకులు, పార్టీ కార్యకర్తలు, పార్టీ అభిమానులు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దుర్గం శ్యామ్ రావు,రామ్ ప్రసాద్ గౌడ్ సాయి, మైనొద్దిన్, ఆత్రం వినోద్, తిరుపతి, శ్రీనివాస్, అబ్బు తదితరులు పాల్గొన్నారు.




## 250 మందికి ఆరోగ్య పరీక్షలు

* ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన
* ఉచితంగా మందులు పంపిణీ

**తాండూర్, జూన్ 14 ప్రభాతవార్త**

తాము పుట్టి పెరిగిన సొంత గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో తాండూర్ మండలం అచ్చలాపూర్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన న్యూరాలజీ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక శ్రీ శ్రీ భారతి తీర్థ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 250 మంది రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.న్యూరో సర్జన్ డాక్టర్ గట్టు అభినయకుమార్, జనరల్ సర్జన్ డాక్టర్ ముద్దు రాఘవ కృష్ణ, ఎండీ డాక్టర్ సృష్టి రోగులను పరీక్షించి అవసరమైన వైద్య సూచనలు అందించారు. మెరుగైన చికిత్స అవసరమైన వారిని ప్రత్యేక ఆసుపత్రులకు రిఫర్ చేశారు. హైదరాబాద్, అహ్మదాబాద్ నగరాల్లో వైద్య సేవలు అందిస్తూ పేరు ప్రఖ్యాతలు సంపాదించిన **మిగతా 2లో..**




నాణ్యమైన బొగ్గు ఉత్పత్తితోనే..

## సింగరేణికి వందేళ్ల ఉజ్వల భవిష్యత్తు

- ✧ పోటీ మార్కెట్‌లో సంస్థ బలోపేతానికి వ్యయాన్ని తగ్గించుకోవాలి
- ✧ కార్మికుల ఆత్మగౌరవాన్ని అపహాస్యం చేస్తే సహించేది లేదు
- ✧ రాజకీయ స్వార్థం కోసం తెలంగాణ ఆస్తిపై అసత్య ప్రచారాలు తగవు
- ✧ కార్మికుల భద్రత, సంక్షేమమే ధ్యేయంగా రూ. 1.25 కోట్ల ప్రమాద బీమా పథకం అమలు
- ✧ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు



**నస్పూర్, జూన్ 14, ప్రభాతవార్త**

పోటీ మార్కెట్ పరిస్థితుల్లో సింగరేణి సంస్థ మరింత బలోపేతం కావాలంటే ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాలని, నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు స్పష్టం **మిగతా 2లో..**


## ఈదురు గాలివాన బీభత్సం..

* తృటిలో తప్పిన పెను ప్రమాదాలు..
* ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలు
* లేచిపోయిన పైకప్పులు మరో ఇళ్లపై పడి విధ్వంసం..
* సహాయం కోసం ఎదురుచూస్తున్న బాధితులు

**మందమర్రి, జూన్ 14, ప్రభాతవార్త**

ప్రకృతి ప్రకోపానికి మందమర్రి పట్టణ ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. రెండు రోజులుగా కురిసిన గాలివాన, ఈదురు గాలులు పట్టణంలో బీభత్సం సృష్టించాయి. క్షణాల్లోనే బలమైన గాలులు వీచడంతో అనేక ప్రాంతాల్లో ఇళ్ల పైకప్పులు ఎగిరిపోగా, అవి మరో ఇళ్లపై పడటంతో భారీ విధ్వంసం చోటుచేసుకుంది. ప్రజలు ప్రాణభయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. పట్టణంలోని పలు కాలనీల్లో రేకులతో నిర్మించిన **మిగతా 2లో..**







## 250 మందికి ఆరోగ్య పరీక్షలు

**(మొదటిపేజీ తరువాయి)**

ఈ ముగ్గురు వైద్యులు అచ్చులాపూర్ గ్రామానికి చెందినవారే కావడం విశేషం. తమ సొంత గ్రామ ప్రజల ఆరోగ్య సంక్షేమం కోసం ముందుకొచ్చి ఉచిత వైద్య సేవలు అందించిన ముగ్గురు డాక్టర్లను ఈ సందర్భంగా శాలువలతో సన్మానించి అభినందించారు. అచ్చులాపూర్ బ్రాహ్మణ సంఘం సభ్యులు గట్టు విశ్వనాథ్ దంపతుల సహకారంతో శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహా వేద పాఠశాల ప్రధాన అధ్యాపకుడు దుద్దుల మనోహర్ శర్మ, సర్పంచ్ మారిశెట్టి స్రవంతి, ఉప సర్పంచ్ గట్టు సంతోష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఈదురు గాలివాన బీభత్సం..

**(మొదటిపేజీ తరువాయి)**

ఇళ్ల పైకప్పులు ఈదురు గాలులకు తట్టుకోలేక లేచిపోయాయి. కొన్ని చోట్ల ఇనుప రాడ్లు, రేకులు గాలికి ఎగిరి పక్కనే ఉన్న ఇళ్లపై పడి గోడలు, కిటికీలు, నీటి ట్యాంకులను ధ్వంసం చేశాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఆ రాడ్లు, రేకులు నేరుగా ఇళ్లలోకి దూసుకెళ్లి ఇంట్లోని ఫర్నిచర్, గృహోపకరణాలను ధ్వంసం చేశాయి. అంతేకాకుండా ఇళ్ల ముందు పార్క్ చేసి ఉన్న కార్లు, ద్విచక్ర వాహనాలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఓ కారుపై సిమెంట్ ఇటుక పడటంతో వాహనం పూర్తిగా ధ్వంసమైంది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో ఇళ్లలో ఉన్నవారికి ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో పెను ప్రమాదం తృటిలో తప్పింది. అయితే చిన్నారులు, వృద్ధులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ అనూహ్య ఘటనతో ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మధ్యతరగతి, పేద కుటుంబాలు మరింత కుదేలయ్యాయి. ఇళ్ల మరమ్మతులు, ధ్వంసమైన సామగ్రి పునరుద్ధరణకు భారీ వ్యయం కావడంతో బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కళ్లముందే జీవితకాల పొదుపుతో సమకూర్చుకున్న వస్తువులు నాశనమవడంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్థిక సహాయం అందించాలని బాధితులు కోరుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేసి తక్షణ సాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రకృతి విపత్తు రూపంలో వచ్చిన ఈ గాలివాన మందమర్రి ప్రజల జీవితాల్లో తీవ్ర విషాదాన్ని నింపిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బాధిత కుటుంబాలు ప్రభుత్వ సహాయం కోసం ఆశగా ఎదురుచూస్తుండగా, అధికారులు త్వరితగతిన స్పందించి వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

## తెలంగాణ స్ఫూర్తి నంది పురస్కారంతో కటుకోజ్వల వేణుకు సత్కారం

**- సామాజిక సేవలకు గుర్తింపుగా తెలుగు వెలుగు సాహితి ప్రత్యేక సత్కారం**

మందమర్రి, జూన్ 14, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన ప్రముఖ గోల్డ్ అప్రైజర్, సామాజిక సేవకుడు బ్రహ్మశ్రీ కటుకోజ్వల వేణుకి సామాజిక సేవా రంగంలో ఆయన అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఖతెలంగాణ స్ఫూర్తి నందిగి పురస్కారంతో ఘనంగా సత్కరించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని తెలుగు వెలుగు సాహితి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. సమాజ సేవను లక్ష్యంగా చేసుకుని నిరంతరం ప్రజలకు అండగా నిలుస్తూ, వివిధ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న బ్రహ్మశ్రీ కటుకోజ్వల వేణు సేవలను నిర్వాహకులు కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలు, ప్రముఖులు, రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, శ్రేయోభిలాషులు ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ఇదే సేవా స్ఫూర్తితో సమాజానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. పురస్కారాన్ని అందుకున్న అనంతరం బ్రహ్మశ్రీ కటుకోజ్వల వేణు మాట్లాడుతూ, తనకు లభించిన ఈ గౌరవం మరింత బాధ్యతను పెంచిందని, ప్రజా సేవే పరమావధిగా భావించి భవిష్యత్తులోనూ సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని తెలిపారు. ఈ సన్మానం మందమర్రి పట్టణానికి గర్వకారణమని, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.




### నాణ్యమైన బొగ్గు ఉత్పత్తితోనే..

# సింగరేణికి వందేళ్ల ఉజ్వల భవిష్యత్తు

**(మొదటిపేజీ తరువాయి)**





చేశారు. మంచిర్యాల జిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు ఆదివారం ఆయన సింగరేణిలోనే అతిపెద్దదైన శ్రీరాంపూర్ ఏరియా ఉపరితల గనిని సందర్శించారు. వ్యూ పాయింట్ వద్ద మొక్క నాటిన అనంతరం గని కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఓపెన్ హౌస్ ఇన్‌స్ట్రక్షన్‌లో రక్షణ పద్ధతులు, బొగ్గు నాణ్యత, నిల్వ, రవాణా లెక్కలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ లాభదాయకత, పోటీతత్వ సామర్థ్యాన్ని పెంచేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. సింగరేణి సంస్థపై జరుగుతున్న ప్రచారంలో వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతోనే ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు తమ వ్యక్తిగత, స్వార్థ ప్రయోజనాల కోసమే సంస్థపై అసత్యాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సింగరేణి కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, ఇది తెలంగాణ ప్రజల ఆస్తి అని తేల్చి చెప్పారు. ఇక్కడి వనరులు, ఈ వ్యవస్థ అంతా ప్రజల నుంచి వచ్చిందేనని, దీనిపై దోపిడీదారులు కన్నెత్తి చూసేందుకు భయపడేలా ప్రజా ప్రభుత్వం అత్యంత ఖచ్చితత్వంతో పనిచేస్తుందని హెచ్చరించారు. కార్మికుల శ్రమ, చెమటతోనే సంస్థ అభివృద్ధి చెంది దేశానికి వెలుగులు ఇస్తోందని, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఎవరు మాట్లాడినా సహించేది లేదన్నారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, వారికి అత్యుత్తమ వైద్య సదుపాయాలతో పాటు పిల్లల భవిష్యత్తు కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తామని ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఏరియా ఆసుపత్రుల్లో అత్యంత ఆధునికమైన క్యాథ్ ల్యాబ్ వసతులను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు దేశంలోనే మొట్టమొదటిసారిగా రూ. 1.25 కోట్ల ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టామని గుర్తుచేశారు. సింగరేణి కార్మికుల పిల్లలు సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతుంటే, వారికి ప్రిలిమ్స్, మెయిన్స్ రాయడానికి, ఇంటర్వ్యూలకు వెళ్లడానికి అవసరమైన పూర్తి ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వమే అందిస్తుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ఎమ్మెల్సీ దండే విఠల్, మంచిర్యాల మేయర్ ధర్ని మధుకర్, సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డైరెక్టర్లు ఎల్.వీ. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, ఈడీ బి. వెంకన్న, జీఎం టి. శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్, కార్మిక సంఘాల నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దిలావర్‌పూర్‌లో ఈదురు గాలులకు వ్యవసాయ క్షేత్రంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

### ఈదురు గాలులకు విరిగిపడిన విద్యుత్ స్తంభం - తప్పిన ప్రాణాపాయం



దిలావర్‌పూర్, జూన్ 14, ప్రభాతవార్త:

మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం కురిసిన ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షానికి ఓ విద్యుత్ స్తంభం ఒక్కసారిగా విరిగిపడింది. పాలోడి కుంట ప్రాంతానికి చెందిన రైతు వల్లె శ్రీనివాస్ వ్యవసాయ క్షేత్రంలో విద్యుత్ తీగలతో సహా ఈ స్తంభం నేలకొరిగింది. స్తంభం కూలిపోయిన సమయంలో పొలంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీంతో పరిసర ప్రాంతాల రైతులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన కారణంగా ఆ పరిసర ప్రాంతాల్లో కొంతసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని దెబ్బతిన్న స్తంభాన్ని, తీగలను పరిశీలించారు. అనంతరం యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వర్షాకాలం ప్రారంభమైనందున ఈదురు గాలులు వీచేటప్పుడు స్తంభాలు, తీగల వద్ద ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ అధికారులు సూచించారు.

## బిఎల్ఎ లు ఓటర్ జాబితాను క్షేత్రస్థాయి నుంచి సేకరించాలి

హాజీపూర్, జూన్ 14, ప్రభాతవార్త



మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వేంపల్లి పద్మావతి గార్డెన్‌లో ఆదివారం మంచిర్యాల శాసనసభ్యులు శ్రీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి శ్రీ కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల మరియు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సార్ పై బూత్ లెవెల్ ఏజెంట్ (బిఎల్ఏ)లకు అవగాహన, శిక్షణ సమావేశంలో ముఖ్య అతిథిగారాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టివిక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఓటర్ల జాబితా బి ఎల్ ఏ వాళ్ళు పూర్తి క్షేత్ర స్థాయిలో సేకరణ చెయ్యాలన్నారు. ప్రభుత్వ పతకలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, పరిశీలకులు టీపీసిసి జనరల్ సెక్రెటరీ రహ్మత్ హుస్సేన్, మాస్టర్ ట్రైనర్ అవేజ్, తెలంగాణ టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, జాతీయ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇంఛార్జి శ్రవణ్ రావు,మంచిర్యాల జిల్లా డీసీసీ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, మంచిర్యాల కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ తూముల నరేష్, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాలు, యువజన కాంగ్రెస్ నాయకులు, బిఎల్ఏ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 20 ఏళ్ల సేవలకు గుర్తింపు ఇవ్వాలి... ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వినతి

**- మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం**

మందమర్రి, జూన్ 14, ప్రభాతవార్త



గత రెండు దశాబ్దాలుగా వైద్య రంగంలో నిరంతర సేవలు అందిస్తున్నప్పటికీ తమ న్యాయమైన డిమాండ్లు, సమస్యలు ఇంకా పరిష్కారానికి నోచుకోవడం లేదని జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ మరియు గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం సమర్పించారు. ఆదివారం మంచిర్యాల జిల్లా మందమర్రి పర్యటనకు వచ్చిన మంత్రి వివేక్ వెంకటస్వామిని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు, జేఏసీ నాయకులు కలిసి తమ సమస్యలను వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలోని 78 కేడర్లలో సుమారు 17 వేల మంది ఉద్యోగులు గత 20 సంవత్సరాలుగా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానంలోనే విధులు నిర్వహిస్తున్నప్పటికీ, ఉద్యోగ భద్రత లేక తీవ్ర అనిశ్చితి మధ్య పనిచేస్తున్నామని తెలిపారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. ఈ అంశాలను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఉద్యోగులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, వివిధ కేడర్లకు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని వారు ఈ సందర్భంగా మరోసారి విజ్ఞప్తి చేశారు.

# సింగరేణిలో సేవా స్ఫూర్తికి ప్రతీకగా పంతుల నాయక్

- రాజ్‌భవన్‌లో గవర్నర్ చేతుల మీదుగా అవార్డు స్వీకరణ
- ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా సింగరేణి గిరిజన అధికారికి గౌరవం
- రక్తదాన సేవలో విశిష్ట కృషి
- పదేళ్లుగా నిరంతర రక్తదాన శిబిరాల నిర్వహణ
- వందలాది మందిని రక్తదానానికి ప్రేరేపించిన సేవాభావి
- రెడ్ క్రాస్ గుర్తించిన విశిష్ట సేవలు
- మానవతా దృక్పథానికి లభించిన అరుదైన గుర్తింపు
- రక్తదానం ద్వారా ప్రాణదాతగా నిలిచిన అధికారి
- సమాజంలో రక్తదాన చైతన్యానికి విశేష కృషి
- సేవా తపనకు రాష్ట్ర స్థాయి పురస్కారం
- ఒక యూనిట్ రక్తం.. అనేక ప్రాణాలకు జీవనదీపం
- సింగరేణి ఉద్యోగుల్లో సేవా భావన పెంపొందించిన నాయకత్వం
- రక్తదాన సేవలో విశిష్ట కృషికి డి. పంతుల నాయక్‌కు గవర్నర్ అవార్డు
- పదేళ్లుగా నిరంతర రక్తదాన శిబిరాల నిర్వహణ వందలాది మందికి ప్రేరణగా నిలిచిన సింగరేణి అధికారి

**జైపూర్, జూన్ 14, ప్రభాతవార్త**

ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్‌భవన్‌లో నిర్వహించిన సేవా పురస్కారాల కార్యక్రమంలో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్‌టీపీపీ), జైపూర్‌లో డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఈ అండ్ ఎం)గా విధులు నిర్వహిస్తున్న డి. పంతుల నాయక్‌కు ప్రతిష్ఠాత్మకమైన ఖఇన్‌స్టిట్యూషనల్ హయ్యెస్ట్ బ్లడ్ డోనర్స్ మోటివేటర్–2026" అవార్డు లభించింది. తెలంగాణ రాష్ట్ర గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా ఈ అవార్డును ఆయన అందుకున్నారు. రక్తదాన శిబిరాల నిర్వహణ ద్వారా అధిక మొత్తంలో రక్తాన్ని సేకరించి రెడ్ క్రాస్ రక్తనిధికి అందించడంలో విశేష కృషి చేసిన సంస్థలు, వ్యక్తులను ఈ సందర్భంగా సత్కరించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం డి. పంతుల నాయక్ ఆధ్వర్యంలో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో భారీ స్థాయిలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. గత పదేళ్లుగా నిరంతరంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల ద్వారా వందలాది మంది ఉద్యోగులు, కార్మికులు రక్తదానం చేయడానికి ముందుకు రావడంతో పాటు సమాజంలో రక్తదానంపై అవగాహన పెంపొందుతోంది. స్వయంగా పలుమార్లు రక్తదానం చేసిన పంతుల నాయక్, వందలాది మందిని రక్తదానానికి ప్రేరేపిస్తూ మానవతా సేవలో ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయన నాయకత్వంలో నిర్వహించిన రక్తదాన శిబిరాలు అనేక ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషించాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ దాన కిషోర్, ఐఏఎస్, రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ రాములు, రాష్ట్ర కోశాధికారి ఓ.ఎస్. రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఐఏఎస్, మంచిర్యాల జిల్లా రెడ్ క్రాస్ శాఖ చైర్మన్ కె. భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి. మధుసూదన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి చందూరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు డి. పంతుల నాయక్‌ను అభినందిస్తూ, ఆయన సేవలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.






రక్తదానం చేస్తున్న ధారావత్ పంతుల నాయక్ (ఫైల్)

## మునీర్ భాయ్ జ్ఞాపకాలకు అక్షరాంజలి

### మంత్రి వివేక్ చేతుల మీదుగా మునీర్ భాయ్ - ప్రొలిటేరియన్ జర్నలిస్టు పుస్తకావిష్కరణ

**మందమర్రి, జూన్ 14, ప్రభాతవార్త**



అక్షరాన్ని ఆయుధంగా మార్చుకుని కార్మిక వర్గ సమస్యల కోసం నిరంతరం పోరాడిన సీనియర్ జర్నలిస్టు మునీర్ జీవిత గాథను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో రచించిన ఖమునీర్ భాయ్ – ప్రొలిటేరియన్ జర్నలిస్టుగ పుస్తకాన్ని తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల మరియు ఉపాధి శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి ఆవిష్కరించారు. మందమర్రి పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ప్రముఖ ప్రజా ఉద్యమ నాయకుడు ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ చెన్నూరు మాజీ ఎమ్మెల్యే విప్ నల్లాల ఓదేలు పాల్గొని మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముందు సీనియర్ జర్నలిస్టు మునీర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అతిథులు, ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువచ్చిన జర్నలిస్టుగా, కార్మిక వర్గానికి అండగా నిలిచిన నాయకుడిగా మునీర్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, మునీర్ ఒక సాధారణ జర్నలిస్టు మాత్రమే కాదని, సమాజ మార్పు కోసం కలం పట్టిన ఉద్యమకారుడని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో సింగరేణి జేఏసీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ కార్మిక లోకాన్ని ఏకం చేసి ఉద్యమ విజయానికి కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, నేటి యువ జర్నలిస్టులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ, మునీర్ ప్రజా సమస్యల పట్ల అంకితభావంతో పనిచేసిన వ్యక్తిత్వమని, ఆయన జీవితం జర్నలిజం విద్యార్థులకు మార్గదర్శకమని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదేలు మాట్లాడుతూ, సింగరేణి ప్రాంత ప్రజల సమస్యలను ఎల్లప్పుడూ ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లిన మునీర్ సేవలను స్మరించుకున్నారు. మునీర్ జీవిత చరిత్ర ఆధారంగా వెలువడిన ఈ పుస్తకం తెలంగాణ ఉద్యమ చరిత్రలో సింగరేణి కార్మికుల పాత్రను, ప్రజా జర్నలిజం విలువలను భావితరాలకు అందించే ఒక విలువైన గ్రంథంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, జర్నలిస్టులు, కార్మిక సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, మునీర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయన సేవలను స్మరించుకున్నారు.

## బాసర ట్రిపుల్ ఐటీ మెస్ ఘటనపై కలెక్టర్ తక్షణమే స్పందించాలి: ఏఐపీఎస్‌యూ

**బైంసా, జూన్ 14, ప్రభాతవార్త:**

బాసర ఆర్‌జీయూకేటీ (ట్రిపుల్ ఐటీ) క్యాంపస్‌లోని ఈ1, ఈ2 శక్తి భోజనశాలలో ఆదివారం ఉదయం విద్యార్థులకు వడ్డించిన అల్పాహారంలో బొద్దింక రావడంపై ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ స్టూడెంట్ యూనియన్ (ఏఐపీఎస్‌యూ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ఆధారాలు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని యూనియన్ నిర్మల్ జిల్లా కార్యదర్శి గడపాలి పరమేష్ పేర్కొన్నారు. క్యాంపస్‌లో ఆహార నాణ్యత లోపించిందని విద్యార్థులు గతంలో ఎన్నోసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా, ఫిర్యాదులు చేసినా సరైన రీతిలో స్పందించకపోవడం వల్లే ఇలాంటి దుస్థితి పునరావృతమవుతోందని విమర్శించారు. వేలాది మంది విద్యార్థుల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న తీవ్రమైన విషయంలో మెస్ కాంట్రాక్టర్లు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం క్షమించరాని నేరమన్నారు. అధికారులు కేవలం ప్రచారాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల ఆరోగ్యం ప్రమాదంలో పడక ముందే జిల్లా కలెక్టర్ ఈ ఘటనపై తక్షణమే స్పందించి ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బాసర ట్రిపుల్ ఐటీ మెస్ సమస్యలపై అధికారులు ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం చూపకపోతే, విద్యార్థి లోకాన్ని ఏకం చేసి సోమవారం నుంచి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని, పోరాటాన్ని ఉధృతం చేస్తామని పరమేష్ హెచ్చరించారు. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో సంఘం ముఖ్య నాయకులు ఉన్నారు.

## నేడు దిలావర్‌పూర్‌లో పర్యటించనున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

**దిలావర్‌పూర్, జూన్ 14, ప్రభాతవార్త:**

బీజేఎల్పీ నేత, ముధోల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సోమవారం జిల్లాలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా వివిధ గ్రామాల్లో పలు నూతన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేస్తారు. దిలావర్‌పూర్ మండల కేంద్రంతో పాటు ఒడ్డెపల్లి, లోలం గ్రామాల్లో పాఠశాల కాంపౌండ్ వాల్, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ (పీడబ్ల్యూఎమ్), స్వయం సహాయక సంఘాల (ఐకేపీ) భవనాలు, వర్క్ షెడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ భవనం, కేజీబీవీ అదనపు తరగతి గదుల నిర్మాణాలకు ఆయన భూమిపూజ చేయనున్నారు. అనంతరం నర్సాపూర్ (జి) మండల కేంద్రం, అంజని తండా గ్రామాల్లో కూడా స్వయం సహాయక సంఘ భవనాలు, వర్క్ షెడ్లు, అంగన్‌వాడీ భవనాలు, కొత్త గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేస్తారు. ఈ నియోజకవర్గ స్థాయి అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొననున్నారు.

# గాలి వాన బీభత్సం..

## తృటిలో తప్పిన ప్రాణాపాయం - మందమర్రిలో పది ఇళ్ల పైకప్పులు ధ్వంసం - భారీ నష్టం

**మందమర్రి, జూన్ 14, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలో గురువారం అర్ధరాత్రి సమయంలో వీచిన ఈదురు గాలులు, గాలివాన బీభత్సం సృష్టించాయి. ఒక్కసారిగా బలంగా వీచిన గాలులకు ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పట్టణంలోని 12వ వార్డు పరిధిలో గల శిశు మందిర్ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇనుప గాడర్లు, షెడ్ రేకులు గాలుల ధాటికి ఎగిరిపడి సమీపంలోని కాలనీలోని నివాసాలపై పడటంతో భారీ ఆస్తి నష్టం సంభవించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, పాఠశాల వెనుక భాగంలోని కాలనీలో సుమారు పది ఇళ్ల పైకప్పులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇళ్లలోని ఫర్నిచర్, గృహోపకరణాలు, విద్యుత్ పరికరాలు, విలువైన వస్తువులు దెబ్బతిన్నాయి. పలుచోట్ల ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు పగిలిపోగా, ఇళ్లలో నిల్వ ఉంచిన ధాన్యం, దుస్తులు, అవసరమైన సామాగ్రి కూడా వర్షపు నీటిలో తడిసి నష్టపోయాయి. అయితే ప్రమాదం సంభవించిన సమయంలో కుటుంబ సభ్యులు ఇళ్లలోనే ఉన్నప్పటికీ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరట కలిగించింది. భారీ ఇనుప గాడర్లు, షెడ్ రేకులు ఇళ్లపై పడినప్పటికీ తృటిలో ప్రాణాపాయం తప్పిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గాలివాన అనంతరం కాలనీవాసులు రాత్రంతా భయాందోళనల మధ్య గడిపారు. చిన్నారులు, వృద్ధులు తీవ్ర భయానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక



ప్రజాప్రతినిధులు, అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి నష్టాన్ని పరిశీలించాలని బాధితులు కోరుతున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, శిశు మందిర్ పాఠశాల షెడ్ నిర్మాణం కారణంగానే తమ ఇళ్లకు నష్టం వాటిల్లిందని ఆరోపించారు. ప్రభుత్వం గానీ, పాఠశాల యాజమాన్యం గానీ ముందుకు వచ్చి తమకు జరిగిన నష్టానికి తగిన పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పట్టణ పరిధిలో ఉన్న పాత షెడ్లు, బలహీన నిర్మాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ధని గ్రామంలో రోడ్డుపై విరిగిపడిన చెట్టు

**సారంగాపూర్, జూన్ 14, ప్రభాతవార్త:**

మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. గాలివాన బీభత్సానికి మండలంలోని పలు ప్రాంతాల్లో ఇళ్ల పైకప్పులు లేచిపోగా, మరికొన్ని చోట్ల పెద్ద పెద్ద చెట్ల కొమ్మలు విరిగి రహదారులపై పడ్డాయి. ముఖ్యంగా నిర్మల్ స్వర్ణ ప్రధాన రహదారి మార్గమధ్యంలోని ధని గ్రామంలో భారీ వృక్షాలు రోడ్డుపై విరిగిపడటంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ విషయాన్ని గమనించిన మాజీ సర్పంచ్ బడి పోతన్న, స్థానిక యువకులు, పారిశుద్ధ్య కార్మికులు వెంటనే స్పందించారు. వారంతా కలిసి ఎంతో ప్రయాసకోర్చి గంటపాటు శ్రమించి రోడ్డుపై పడిన చెట్లను, కొమ్మలను తొలగించారు. దీంతో నిలిచిపోయిన ట్రాఫిక్ క్లియర్ అయి రాకపోకలు యథావిధిగా పునరుద్ధరణకు నోచుకున్నాయి. ఈ శ్రమదాన కార్యక్రమంలో స్థానిక యువకులు, గ్రామస్తులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



ధని గ్రామంలో రోడ్డుపై పడిన చెట్లను తొలగిస్తున్న మాజీ సర్పంచ్, యువకులు



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పుష్పలతకు కుట్టుమిషన్ అందజేస్తున్న గ్రామ పెద్దలు

## లయన్స్ క్లబ్ సౌజన్యంతో ఉపాధి కొరకు కుట్టుమిషన్ పంపిణీ

**భైంసా, జూన్ 14, ప్రభాతవార్త:**

మండలంలోని మహాగావ్ గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కమలానగర్ (హైదరాబాద్) సౌజన్యంతో ఓ నిరుపేద మహిళకు కుట్టుమిషన్ పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ సర్వీస్ అడ్వైజరీ డైరెక్టర్ మాణిక్యారెడ్డి గూడూరి ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మహాగావ్ గ్రామానికి చెందిన సీహెచ్. పుష్పలత భర్త పండరి గతంలో మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు కాగా, అందులో ఒక కుమారుడు హర్షవర్ధన్ (12) తీవ్రమైన కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. భర్త లేకపోవడం, కుమారుడి వైద్య ఖర్చులు భారం కావడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయాన్ని గమనించిన లయన్ మాణిక్యారెడ్డి గూడూరి.. పుష్పలత స్వయం ఉపాధి పొంది కుటుంబాన్ని పోషించుకునేందుకు వీలుగా ఉచితంగా కుట్టుమిషన్ అందజేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాకేష్, వార్డు సభ్యులు టీ. విశ్వనాథ్, గజ్జారాం, గ్రామ పెద్దలు టీ. శంకర్, పిరాజీ, బీ. సాయినాథ్‌ల చేతుల మీదుగా పుష్పలత కుటుంబానికి ఈ కుట్టుమిషన్‌ను అందజేశారు. కష్టకాలంలో తమకు ఉపాధి మార్గం చూపిన లయన్స్ క్లబ్ ప్రతినిధులకు, గ్రామ పెద్దలకు పుష్పలత కృతజ్ఞతలు తెలిపారు.



## టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా సవరణపై బీఎల్‌ఏల అవగాహన శిక్షణ శిబిరం

**భైంసా, జూన్ 14, ప్రభాతవార్త:**

భైంసా పట్టణ కేంద్రంలోని శ్రీ బ్యాంకెట్ హాల్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్‌ఏ) అవగాహన శిక్షణ శిబిరం నిర్వహించారు. ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావు పటేల్ నేతృత్వంలో ఈ కార్యక్రమం సాగింది. ఈ శిక్షణ శిబిరానికి టీపీసీసీ ముధోల్ నియోజకవర్గ అబ్జర్వర్ కోటియా నాయక్, రాణాప్రతాప్ ముఖ్య అతిథులుగా హాజరై ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి బూత్ పరిధిలో అర్హులైన కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణలపై ఏజెంట్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భోజారం పటేల్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంప్రకాష్ లడ్డా, ముధోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రావుల గంగారెడ్డి, శంకర్ చంద్రే, మాజీ ఎంపీపీ రాంచందర్, చంద్రకాంత్, వివిధ మండలాల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీటీసీలు, ఆత్మ చైర్మన్లు, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కెరమెరి నూతన ఎస్సైగా జి.సుధాకర్

**కెరమెరి, ఆదివారం 14, ప్రభాతవార్త**



కెరమెరి నూతన ఎస్ఐ గా జి సుధాకర్ ఆదివారం పదవి బాధ్యతలు స్వీకరించారు గతంలో పనిచేసిన ఎస్ఐ మధుకర్ రామగుండం బదిలీపై వెళ్లగా సుధాకర్ కాగజ్నగర్ నుండి కెరమెరి బదిలీపై వచ్చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెరమెరి మండల ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు మండల ప్రజలు తనకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

## పీఆర్‌టియూలోకి భారీగా చేరికలు

### - ఉపాధ్యాయుల విశ్వాసానికి ప్రతీకగా పీఆర్‌టియూ

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 14, ప్రభాతవార్త :**

బలమైన మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకత్వంతో ఉపాధ్యాయులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, రాష్ట్రంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ముందుండే సంఘంగా పేరుగాంచిన పీఆర్‌టియూ కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర సంఘాలకు చెందిన కొమ్ము లక్ష్మీనారాయణ, కంబాల జయేందర్, ముదాం కిరణ్, దుర్గం ఆనందరావు, గొమాసె భగవాన్ తదితరులు ఆదివారం కాగజ్‌నగర్‌లో పీఆర్‌టియూ సంఘంలో చేరారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సునార్కర్ అనిల్ కుమార్, గౌరవ జిల్లా అధ్యక్షుడు ఉప్పుల నరసింహాచారి మాట్లాడుతూ ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా 50 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం (డీఏ) విడుదల, బకాయి బిల్లుల చెల్లింపు, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు, దిశిళీ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఉచిత హెల్త్ కార్డుల మంజూరు, అలాగే జూలై నెలలో నిర్వహించాల్సిన బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీఆర్‌టియూ సంఘం బలోపేతానికి ఈ చేరికలు మరింత ఊతమిస్తాయని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎనగంటి బిక్షపతి, ముంజంపల్లి రమేష్, తంగేడి పల్లి రాకేష్, రౌతు రవి, రతన్ గైన్, పొలదాసరి రామచందర్, బి. మొండయ్య, జైరాం, అన్‌దీప్ తదితరులు పాల్గొన్నారు.





## మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి : ఎమ్మెల్యే

### గ్యాస్, వంటనూనె లేకుండా వంటల పోటీలు.. విజేతలకు బహుమతులు

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 14, ప్రభాతవార్త :**

భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో పట్టణంలోని సర్‌సిల్క్ ఏరియాలో గ్యాస్, వంటనూనెలు ఉపయోగించకుండా వంటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశీ మారక ద్రవ్యాన్ని పొదుపు చేయాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు గ్యాస్, వంటనూనెల వినియోగాన్ని తగ్గిస్తూ ప్రత్యామ్నాయ పద్ధతుల్లో వంటలు చేయడం అభినందనీయమని అన్నారు. మహిళల సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం గత కొన్నేళ్లుగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. పీఎం స్వనిధి, పీఎం జన్‌ధన్, పీఎంఈజీపీ వంటి పథకాల ద్వారా మహిళలకు ఆర్థికంగా బలోపేతం చేసే అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో సగభాగమైన మహిళలు ఆత్మన్యూనతా భావాన్ని విడనాడి, స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకురాలు సిరిమల్లె మంజుల, కౌన్సిలర్ గజ్జల లావణ్య, మాజీ కౌన్సిలర్ ప్రవంత భాయి, సామాజిక సేవకులు స్వాతి డాకుల్కర్, అన్నపూర్ణ, సరోజ, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా

# సేవా కార్యకర్తలకు ఘన సన్మానం

- రక్తదానం ప్రాణదానంతో సమానం.. యువత ముందుకు రావాలి







**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 14, ప్రభాతవార్త**

ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని కాగజ్‌నగర్ పట్టణంలో రక్తదాన సేవా కార్యక్రమాల్లో విశేషంగా కృషి చేస్తున్న సేవాభావం కలిగిన వ్యక్తులను హిందూ జాగరణ్ మంచ్, మార్వాడి యువ మంచ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పట్టణంలో గర్భిణీ స్త్రీలు, తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులు, ప్రమాదాలు ,ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు అవసరమైన సమయంలో రక్తం అందేలా నిరంతరం సమన్వయం చేస్తూ, సమయంతో సంబంధం లేకుండా సేవలందిస్తున్న పలువురు సేవా కార్యకర్తలను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, రక్తదానం అనేది ప్రాణదానంతో సమానమని పేర్కొన్నారు. రక్తం అవసరమైన సమయంలో దాతలను సమీకరించి అనేక మంది ప్రాణాలను కాపాడటంలో ఈ సేవా కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. స్వార్థరహిత సేవా దృక్పథంతో సమాజానికి అండగా నిలుస్తూ, అనేక కుటుంబాలకు భరోసానిస్తున్నారని తెలిపారు. సమాజ సేవ పట్ల వారు చూపుతున్న అంకితభావం యువతకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. అనంతరం సేవా కార్యకర్తలు మాట్లాడుతూ రక్తదానం ద్వారా ఒక వ్యక్తి అనేక మంది ప్రాణాలను కాపాడగలడని అన్నారు. ప్రతి ఆరోగ్యవంతమైన యువకుడు స్వచ్ఛందంగా రక్తదాతగా నమోదు చేసుకుని అవసరమైన వారికి సహాయం చేయాలని పిలుపునిచ్చారు. రక్తం కొరత కారణంగా ఏ ఒక్కరి ప్రాణం కూడా ప్రమాదంలో పడకూడదనే లక్ష్యంతో తమ సేవలు కొనసాగిస్తామని తెలిపారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమం సేవా స్ఫూర్తిని చాటుతూ, మరింత మంది యువత రక్తదాన ఉద్యమంలో భాగస్వాములు కావడానికి ప్రేరణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో హిందూ జాగరణ్ మంచ్, మార్వాడి యువ మంచ్ ప్రతినిధులు, వివిధ సామాజిక సంస్థల సభ్యులు, యువకులు, రక్తదాతలు, పట్టణ ప్రముఖులు, సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు ప్రొసీడింగ్ కాపీ అందజేసిన మాజీ ఎమ్మెల్యే

**భైంసా, జూన్ 14, ప్రభాతవార్త:**

తానూర్ మండలంలోని దాగం గ్రామంలో సుమారు రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని ముధోల్ మాజీ ఎమ్మెల్యే జీ.విఠల్ రెడ్డి అందజేశారు. భైంసా పట్టణ కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఈ కాపీని గ్రామ మాజీ సర్పంచ్‌కు అందజేశారు. గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి సహకరించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు, ప్రత్యేక చొరవ తీసుకున్న మాజీ ఎమ్మెల్యే జీ.విఠల్ రెడ్డికి ఈ సందర్భంగా గ్రామస్థుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ సాయినాథ్, పార్టీ సీనియర్ నాయకులు పీ. గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాం గ్రామంలో బీరప్ప బోనాలు

**సారంగాపూర్, ప్రభాతవార్త:**



మండలంలోని జాం గ్రామంలో కురుమ కులస్తుల ఆరాధ్య దైవమైన బీరప్ప స్వామి బోనాల పండుగ ఆదివారం అత్యంత వైభవంగా సాగింది. ఉదయం నుంచే కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సాంప్రదాయబద్ధంగా కుటుంబ సమేతంగా బోనాలను తలపైకెత్తుకుని డోలు వాయిద్యాలు, శివసత్తుల పూనకాల మధ్య గ్రామ వీధుల వెంబడి ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. ఈ ఊరేగింపులో గ్రామ యువకులు, మహిళలు, చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఆలయానికి చేరుకుని బీరప్ప స్వామికి భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. తమ పిల్లాపాపలను చల్లగా చూడాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామంలోని ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని వేడుకున్నట్లు భక్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కురుమ సంఘం పెద్దలు, యువకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేరడిగొండలో ఈదురు గాలుల బీభత్సం

### ఆరు విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి

**నేరడిగొండ, జూన్ 14, ప్రభాతవార్త:**





మండలంలోని గోవిందపూర్ గ్రామంలో ఆదివారం సాయంత్రం వీచిన భారీ ఈదురు గాలులు తీవ్ర విధ్వంసం సృష్టించాయి. గాలివాన బీభత్సానికి గ్రామంలోని ఆరు విద్యుత్ స్తంభాలు ఒకేసారి విరిగిపడటంతో పాటు పలు భారీ చెట్లు నేలకొరిగాయి. మరికొన్ని చోట్ల నిరుపేదల ఇళ్ల పైకప్పు రేకులు గాలికి కొట్టుకుపోయాయి. ఒక్కసారిగా ఈదురు గాలులు చుట్టుముట్టడంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. విద్యుత్ తీగలు, స్తంభాలు తెగిపడటంతో గ్రామంలో సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న నాగమల్లి, పీసరా గ్రామ మాజీ సర్పంచ్‌లు వెంటనే గోవిందపూర్‌లో పర్యటించారు. దెబ్బతిన్న ఇళ్లను, విరిగిపడిన స్తంభాలను పరిశీలించి బాధితులకు ధైర్యం చెప్పారు. ఈ గాలివాన వల్ల జరిగిన ఆస్తి, విద్యుత్ నష్టాన్ని తక్షణమే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. యుద్ధప్రాతిపదికన స్పందించి దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించాలని, నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలని వారు కోరారు.

## రైతు రిజిస్ట్రీ నమోదు తప్పనిసరి

### - మండల వ్యవసాయ అధికారి వీరన్న

**వేమనపల్లి, జూన్ 14, ప్రభాతవార్త**



వ్యవసాయ, ఉద్యాన రైతులు రైతు రిజిస్ట్రీలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వీరన్న సూచించారు. ఇప్పటివరకు నమోదు చేసుకోని రైతులు సమీప మీసేవ, సీఎస్సీ కేంద్రం, రైతు వేదికలోని వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు. రైతు భరోసా, పీఎం కిసాన్, వ్యవసాయ యాంత్రీకరణ పథకాలతో పాటు యూరియా సబ్సిడీ వంటి ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలంటే రైతు రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరి అని తెలిపారు. అలాగే ఆయిల్ పామ్, డ్రిప్, స్ప్రింక్లర్, పండ్లు, కూరగాయల సాగుకు సంబంధించిన ఉద్యాన పథకాల రాయితీలు పొందేందుకు కూడా నమోదు అవసరమని పేర్కొన్నారు. రైతులు ఆలస్యం చేయకుండా త్వరితగతిన నమోదు చేసుకోవాలని వీరన్న విజ్ఞప్తి చేశారు.

## ప్రపంచ రక్తదాతల రోజున రక్తదానం చేసిన బీజేపీ నాయకుడు

**సారంగాపూర్, జూన్ 14, ప్రభాతవార్త:**



ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని సారంగాపూర్ మండలంలోని సాయినగర్ తండాకు చెందిన బీజేపీ నాయకుడు, మీడియా ప్రతినిధి సబ్లే నానాక్ సింగ్ ఆదివారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తాన్ని దానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాన్ని కాపాడిన వారమవుతామన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజంలో కొందరిలో రక్తదానంపై ఇప్పటికీ అనేక అపోహలు, భయాలు ఉన్నాయని, రక్తం ఇస్తే వీక్ అయిపోతామనే అపోహలను వీడాలని సూచించారు. ప్రాణదాతలుగా నిలిచే ఇలాంటి మంచి పనుల కోసం భయపడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా రక్తదానం చేయాలని కోరారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ జాతరకు రాజారాం సిద్ధం

### - భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు

### - రాజారాం గ్రామంలో నెలకొన్న జాతర సందడి

**వేమనపల్లి, జూన్ 14, ప్రభాతవార్త**



వేమనపల్లి మండలం రాజారాం గ్రామంలో వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ జాతరకు గ్రామం ముస్తాబవుతోంది. ఈ నెల 15, 16 తేదీలలో నిర్వహించనున్న జాతర సందర్భంగా ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు, తాగునీరు, విద్యుత్ వెలుగులు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. జాతరకు వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహక కమిటీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. రాజారాం ఇన్చార్జి సర్పంచ్ ఎనుగంటి మల్లీశ్వరి శేఖర్ రెడ్డి ఆలయ ప్రాంగణం, ప్రధాన వీధులను శుభ్రపరిచి అందంగా అలంకరిస్తున్నారు. జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జాతర ఏర్పాట్లు తుదిదశకు చేరుకోవడంతో రాజారాం గ్రామంలో ఇప్పటికే ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని, జాతర సందడి కనిపిస్తోంది.

## మండల సర్పంచుల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**సారంగాపూర్, జూన్ 14, ప్రభాతవార్త:**



మండల సర్పంచుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని మాజీ సర్పంచ్‌లందరూ ప్రత్యేకంగా సమావేశమై అందరి సమక్షంలో ఈ నూతన కమిటీని ఎంపిక చేశారు. మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా మంతెన గంగారెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా కోనేరు భూమన్న, ప్రధాన కార్యదర్శిగా కరిపే రవళి విలాస్, ఉపాధ్యక్షుడిగా జాదవ్ దిలీప్, మీడియా ఇన్‌చార్జ్‌గా ఆడే పంచిబాయ్ దిలీప్, కోశాధికారిగా రాథోడ్ గవాస్కర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మంతెన గంగారెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి, స్థానిక సమస్యల పరిష్కారానికి సర్పంచ్‌లందరం సమన్వయంతో కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గ్రామాలను సమగ్రాభివృద్ధి వైపు నడిపిస్తామని పేర్కొన్నారు. అనంతరం గౌరవ అధ్యక్షుడు కోనేరు భూమన్న మాట్లాడుతూ సర్పంచ్‌లందరూ ఐక్యంగా ఉంటూ రాజకీయాలకు అతీతంగా మండల ప్రగతికి సహకరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల ప్రతినిధులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గానికి పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు అభినందనలు తెలిపారు.